# ప్రేమ

అయిజాక్ అసిమోవ్

తెలుగు: గోపాలం.కె.బి.



టోనీ పొడుగరి. అందగాడు. అయితే, అతని ముఖ కవళికల్లో ఎటువంటి మార్పు, కదలిక లేదు. క్లెయిర్ బెల్మాంట్ తలుపు సందుల్లోంచి అతగాడిని తేరిపార చూచింది. ఆమెలో ఏదో చెప్పరాని భయం, విముఖత.

"లేదు, లారీ! అత నీ ఇంట్లో ఉండడానికీ నేను ఒప్పుకోను!" ఇంతకన్నా ఈ భావాలను బాగా చెప్పాలంటే ఏమిటి మార్గం అన్నట్లు ఆవిడ తనలో తాను సతమతమవుతున్నది. చెప్పే మాటలు బాగుండాలి. ఈ పీడ విరగడవాలి. కానీ, అ దేమీ సాధ్యం కాలేదు. అరిగిన రికార్డులాగ తిరిగి అదే జవాబు బయటకు వచ్చింది.

"అహఁ! నా వల్ల కాదు!"

లారీ బెల్మాంట్ భార్య వేపు తీక్షణంగా చూచాడు. అతని కళ్లలోని చిరాకును చూడడం క్లెయిర్‌కు సుతరామూ ఇష్టం లేదు. ఆమె కందులో తన అసమర్థత కనబడుతుంది.

"తప్పదు క్లెయిర్!" అన్నా డతను. "నీ విప్పు డిలా అంటే కుదరదు. ఇందుకు ఒప్పుకున్నందుకే కంపెనీ వారు నన్ను వాషింగ్‌టన్ పంపుతున్నారు. పైగా ప్రమోషన్ కూడా ఇస్తున్నారు. నీ కెలాంటి అపాయం కలగదు. నీకు ఆ సంగతి తెలుసు. మ రేమిటి నీ సందేహం?"

ఆమె నిస్సహాయంగా చూసింది. "నా కేదో భయంగా ఉంది. అతడిని,... అతడిని చూడడానికే భయంగా ఉంది!"

"అతను కూడా నీకూ, నాకూ మల్లేనే మనిషే - ఇక నీ వేమీ చికాకు పెట్టకు. పద! బయటకు!"

అతను భార్యను ఇంచుమించు బయట గదిలోకి నెట్టాడు. క్లెయిర్ తన ఇంట్లో తనే భయపడిపోతోంది. "అది" అక్కడే నిలబడి ఉంది. కళ్లలో ఏదో గౌరవ భావంతో క్లెయిర్ వేపు చూసింది. చూశాడనా లేమో! మరో మూడు వారాలు మీ సేవలోనే ఉంటా నన్నట్లున్నాయి అతని చూపులు. డాక్టర్ సూసన్ కాల్విన్ కూడా అక్కడే ఉంది. యంత్రాలతో చాలా కాలం పని చేసి, చేసి ఆవిడ కూడా ఒక యంత్రం లాగే, ఆ యంత్రాల రక్తం తన రక్తంలో పారుతున్నట్లు.... యంత్రం లాగే ఉంది. మాటా పలుకూ లేకుండా... ఉంది.

"హెలో" క్లెయిర్ నోటి నుండి పొడిగా, అయిష్టంగా మాటలు, దొర్లాయి. లారీ మాత్రం పరిస్థితిని బయట పడనీయకూడ దన్నట్లు గబ గబా మాట్లాడ్డం మొదలు పెట్టాడు. "క్లెయిర్! ఇతనే టోనీ! భలేవాడులే!... టోనీ! ఈవి డేనోయ్ నా భార్య! క్లెయిర్ తన పేరు!" లారీ వెళ్లి టోనీ భుజం మీద చెయ్యి వేసి నిలబడ్డాడు. టోనీ ముఖంలో గాని, మరో రకంగా గానీ కొత్త భావం, కదలిక కనబడలేదు.

"ఎలా ఉన్నారు మిసెస్ బెల్మాంట్!" అని మాత్రం అన్నా డతను.

క్లెయిర్ ఆ గొంతు విని ఒక్కసారి ఉలిక్కి పడింది. ఆ గొంతు గాఢంగా, మృదువుగా ఉంది.

"అమ్మో! నీవు మాట్లాడగలవు కూడానా?" వద్దను కుంటూనే ఆవిడ ప్రశ్న అడిగేసింది.

"ఏం? నాకు మాటలు రా వనుకున్నారా?"

క్లెయిత్ బలహీనంగా నవ్వగలిగింది. ఆమె ఏ మనుకుందో ఆమెకే తెలీదు. పక్కకు ఎక్కడికో చూచింది. నెమ్మదిగా క్రీగంట అతనికేసి చూసింది. అతని జుట్టు నల్లగా, మెత్తగా ఉంది. అ దేమిటి? ప్లాస్టికా? నిజంగా వెంట్రుకలేనా? చక్కగా అమరిన ఆ దుస్తుల్లో, అతని ఆలివ్ రంగు చర్మం చేతులు, ముఖం మృదువుగా కనబడుతోంది.

భీతి కలసిన ఆశ్చర్యంలో ఆమె కొంచెం సేపు కొట్టుకుపోయింది. డాక్టర్ కాల్విన్ మాటలతో తిరిగి ప్రపంచంలోకి వచ్చింది.

"మిసెస్ బెల్మాంట్! మీరు ఈ ప్రయోగం ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకున్నారనే నే ననుకుంటాను. మీ వారు మీకు అన్ని సంగతులూ చెప్పా నన్నారు. యు.ఎస్.రోబోస్ అండ్ మెకానికల్ మెన్ వారి సీనియర్ సైకాలజిస్టు హోదాలో నేను కూడా కొన్ని విషయాలు చెబుతాను.

**టోనీ మర మనిషి. కంపెనీ కాగితాల్లో అతని పేరు 'టి.ఎస్.త్రీ'. అయినా టోనీ అని పిలిస్తే పలుకుతాడు. అతను యాంత్రిక భూతమేమీ కాదు. అలాగని యాభై ఏళ్ల క్రితం రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో తయారు చేసిన లెక్కల యంత్రం కూడా కాదు. అతని మెదడు మన మెదళ్లకు ఎందులోనూ తీసిపోదు.** అది, అతి సూక్ష్మస్థాయిలో ఏర్పాటు చేసిన పెద్ద టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ లాంటిది. కోట్లాది కనెక్షన్‌లను కుదించి ఆ బుర్రలో ఇమిడ్చారు.

"ఇలాంటి మెదడు ఒక్కొక్క రోబోకు వేరువేరుగా తయారు చేస్తారు. వీటిలో కనెక్షన్‌ల గురించి ముందే నిర్ణయిస్తారు. అన్నింటికీ ముందుగా ఇంగ్లీషు భాష, తరువాత వారి వారి పనులకు సరిపడేట్లు, తెలియవలసిన సంగతులన్నీ తరువాత తెలియవలసినంత మేరకు తెలిసేలా ఏర్పాటు చేస్తారు.

"ఇప్పటి వరకు యు.ఎస్.రోబో వారు కేవలం పారిశ్రామిక రోబోలను మాత్రమే తయారు చేసేవారు. మనిషి పనిచేయడం అసాధ్యమయిన చోట్ల అంటే, ఉదాహరణకు గనులు, సముద్రాల లోపల మాత్రమే వీటిని వాడుకున్నారు. ఇప్పుడు మాత్రం ఇక మేము నగరాల మీదకు, ఇళ్ల మీదకు



దండెత్త దలచాం! అలా జరగాలంటే ఆడ, మగ జనం యావత్తు, భయం లేకుండా ఈ మర మనుషులను తమ మధ్యలోకి రానివ్వాలి. మీరు భయపడ నవసరం లేనే లేదని అర్థం అయిందనుకుంటాను."

"అస లా ప్రసక్తే లేదు, క్లెయిర్!" లారీ మధ్యలో అడ్డుకున్నాడు. "నేను మాట ఇస్తున్నానుగా! అతను నీకు హాని కలిగించడం అసాధ్యం! అలాగయ్యేట్లుంటే నిన్ను అతనితో ఒంటరిగా వదలడానికి నేను సిద్ధమవుతా నా?"

క్లెయిర్ చటుక్కున దొంగ చాటుగా టోనీ కేసి చూచింది. "నే నతనికి కోపం తెప్పించే ప నేదయినా చేస్తే?" గొంతు తగ్గించి అనుమానంగా అడిగింది.

"గుసగుస లాడ వలసిన అవసరమే లేదు." డా॥ కాల్విన్ నెమ్మదిగా చెప్పింది. "అతనికి కోపం రావడం జరగనే జరగదు. చెప్పానుగా, అతని మెదడులోని కనెక్షన్‌లను గురించి ముందే నిర్ణయించి ఉంచామని. వీటిలో అన్నిటికన్నా ముఖ్యమయిన కనెక్షన్‌ను మేము రోబోటిక్స్‌లో ఫస్ట్ లా అంటాము. ఆ నియమ మేమిటో తెలుసా? 'మర మనిషి మానవులకు హాని కలిగించ కూడదు. మనిషి కే దయినా హానీ కలుగుతుంటే చూస్తూ ఊరుకోకూడదు' అని! మర మనుషు లన్నింటినీ ఈ పద్ధతి మీదే తయారు చేస్తాము. బలవంతంగా కూడా రోబో చేత మనిషికి హాని కలిగేలా చేయడం వీలు పడదు. కాబట్టి టోనీ, మీరు కలసి మాకు ఈ ప్రయోగం విషయంలో సహకరించాలి. ఈ లోగా మీ వారు వాషింగ్‌టన్ వెళ్లి చట్టబద్ధంగా ప్రభుత్వం వారు జరిపే ప్రయోగాల గురించి చర్చలు జరుపుతారు."

"అంటే మా ప్రయోగం చట్టబద్ధం కా దనా?"

లారీ గొంతు సవరించుకున్నాడు. "ఆఁ! ఇప్పుడే కాదు! అయినా పరవాలేదు. అతను ఈ ఇల్లు వదిలి బయటకు వెళ్లడు. అతను ఎవరి కంటా పడకుండా నువ్వు కూడా జాగ్రత్త పడాలి. అంతే... ఆఁ! మరో సంగతి! నేను కూడా ఇక్కడ ఉండిపోయే వాడినే. కానీ నా కేమో ఈ రోబోలను గురించి చాలా తెలుసు. పరీక్షలో విపరీతమయిన పరిస్థితుల గురించి కూడా తెలుసుకోవాలంటే నీలాంటి - అంటే రోబోలను గురించి అస లేమీ తెలియని వాళ్లతో నయితేనే బా గుంటుంది. అస లలాగే జరగాలి కూడా!"

"అలాగా!" క్లెయిర్ గొణిగింది. అంతలో చటుక్కున ఒక ఆలోచన వచ్చిం దామెకు - "ఇంతకూ అత నేం చేస్తాడు?"

"ఇంటి పని అంతా!" డా॥ కాల్విన్ చెప్పింది. ఆవిడ లేచి వెళ్లడానికి సిద్ధమయింది. లారీ ఆవిడను గేటు దాకా సాగనంప వెళ్లాడు. క్లెయిర్ బెరుకుగా అక్కడే ఉండి పోయింది. ఎదురుగా గోడ మీద నున్న అద్దంలో ఆమెకు తన ముఖం కనబడుతోంది. ఆమె ముఖం చటుక్కున పక్కకు తిప్పుకుంది. ఆమెకు తన చుంచు ముఖం, గజిబిజి జుట్టు చూచుకోవడం ఏ మాత్రం ఇష్టం లేదు. టోనీ తన వేపే చూస్తున్నాడని గమనించి చిరు నవ్వు నవ్వింది. అప్పుడు ఆమెకు తోచింది.

## అతను కేవలం ఒక యంత్రం!

లారీ బెల్మాంట్ ఎయిర్ పోర్ట్‌కి బయలు దేరాడు. దారిలో గ్లాడిస్ క్లాఫర్న్ కనిపించింది. అలాంటి అమ్మాయిలు ఎన్ని సార్లు చూచినా మళ్లీ చూడాలని పించేలా అందంగా, పొందికగా ఉంటారు. కానీ, అదే పనిగా చూడడానికి వీలు లేకుండా మెరిసిపోతూ ఉంటారు. గ్లాడిస్ ముఖంలో చెరగని చిరు నవ్వు, ఆ చుట్టూ సన్నని సెంటు వాసన, రా రమ్మని పిలుస్తున్నట్లు ఉంటాయి. లారీ నడకలో బ్రేకు పడినట్లు అనిపించింది. ఒక్క సారి హాటు సర్దుకుని ముందుకు సాగాడు.

అతనిలో ఏదో చెప్పరాని కోపం మరో సారి రేగింది. తన భార్య గుర్తుకు వచ్చింది. ప్చ్! ఏం లాభం! తను ఈ గ్లాడిస్‌తో స్నేహం చేయొచ్చుగా! ఒకటి రెండు సార్లు కలిసినా క్లెయిర్ పెదవి విప్పి మాట్లాడలేదు. అతనికి ఊహలు లేవు. టోనీతో పరీక్ష తనకు ఒక పెద్ద ఛాన్సు! అ దంతా క్లెయిర్ చేతుల్లో ఉంది. ఇటువంటు పని గ్లాడిస్ లాంటి అమ్మాయి చేతుల్లో ఉంటే మ రెంత బా గుండేదో?

** ** **

బెడ్ రూం తలుపు మీద సన్నగా తట్టినట్లు వినిపిస్తే క్లెయిర్ నిద్ర లేచింది. ఆవిడ ఒక్కసారి భయపడింది. తొలి రో జంతా టోనీని తప్పించుకు తిరిగింది. అప్పుడో, ఇప్పుడో ఒక చిరు నవ్వు మాత్రమే!

"నువ్వా, టోనీ!"

"అవును, మిసెస్ బెల్మాంట్! లోపలికి రావచ్చా?"

రమ్మనే ఉంటుంది తను. అత నప్పుడే గదిలోకి వచ్చాడు. చప్పుడు లేకుండా! అతని చేతులలోని ట్రే గురించి, కళ్లకు, ముక్కుకు కూడా తెలుస్తోంది.

"ఏమిటి! బ్రేక్ ఫాస్ట్ తెచ్చావా?"

అవునండీ!"

'నాకు అక్కర లేదనే ధైర్యం లేదు. అందుకని కదిలి మంచం మీదే కూర్చుంది. ట్రే అందుకుంది. ఆమ్లెట్, బ్రెడ్ - బటర్, కాఫీ.

"పాలు, చక్కెరా వేరుగా తెచ్చాను. మీ రెంత తీసుకుంటారో నాకు తెలీదుగా మరి! ఇంకా మీ అభిరుచులు, అలవాట్లు తెలుసుకోవలసి ఉంది."

ఆమె ఏమీ అనలేదు.

టోనీ నిటారుగా నిలబడి ఉన్నాడు. ఒక క్షణం ఆగి "మీరు ఒంటరిగా తింటా రనుకుంటాను!" అన్నాడు.

"అవును, ను వ్వేమీ అనుకోకపోతే!"

"తర్వాత మీరు బట్టలు ధరించడంలో సాయం చెయ్యనా!"

"అమ్మయ్యో! అక్కర లేదులే!" ఆమె దుప్పటిని గట్టిగా పట్టుకుంది. కాఫీ ఇంచుమించి ఒలికినంత ప నయింది. టోనీ వెళ్లిపోయి, తలుపు వేసిన తర్వాతే సరిగ్గా కూచో గలిగింది.

ఎలాగో ఒక లాగ బ్రేక్ ఫాస్ట్ అయిం దనిపించింది. అతను కేవలం ఒక యంత్రం మాత్రమే. కానీ యంత్రం లాగ కనబడేట్లు అయితే ఇంత భయం

ఉండేది కాదు. అతని ముఖంలో మారని భావం! అ దొకటి మేకు కొట్టి వడవేసినట్లు. ఆ నల్లని కళ్లు, మెత్తని చర్మం వెనకా లోతుల్లో ఏం జరుగుతున్నదో అంతు వట్టదు. ఖాళీ కప్పును ట్రేలో పెడుతుంటే టకటక కొట్టుకుంది.

అప్పుడు గానీ ఆమెకు అర్థం కాలేదు. చక్కెర, పాలు వేసుకోకుండానే తను కాఫీ తాగేసిందని. బ్లాక్ కాఫీ తన కే మాత్రం ఇష్టం లేదు!

** ** **

దుస్తులు ధరించి, నేరుగా వం టింట్లోకి నడిచింది. అది తన ఇల్లు. వం టిల్లు శుభ్రంగా ఉంచుకోవడం తనకు అలవాటు. అతను కొంచెం సేపు వేచి ఉండాల్సింది.

వంటింట్లోకి వెళ్లి చూచింది. అక్కడంతా ఇప్పుడే దుకాణం నుంచి తెచ్చి నర్దినట్లు అంతా తళతళ లాడుతోంది. ఒక సారి తేరిపార జూచి వెనక్కి తిరిగింది. ఎదురుగా టోనీ! ఆవిడ ఒక్కడుగు వెనక్కి తగ్గింది.

"ఏం కా వాలండీ?"

"టోనీ!" భయం కాస్త విదిలించుకుని "నీవు నడిచేప్పుడు కాస్త చప్పుడు చేయాలి. ఇలా ఎదురువడితే కష్టం. అవునూ! బ్రేక్ ఫాస్ట్ వం టింట్లో తయారు చేయలేదా?" అంది.

"ఇక్కడే తయారు చేశాను మిసెస్ బెల్మాంట్!"

"అలా కనిపించడం లేదు మరి!"

"తర్వాత శుభ్రం చేశాను లెండి. అలాగే చేయాలను కుంటాను!"

క్లెయిర్ కళ్లు పెద్దవి చేసి చూసింది. ఈ మాటకు ఏం జవాబు చెప్పేది? ఓవన్ తెరిచి లోపలి పాత్రలు చూచింది. తళతళ లాడి పోతున్నాయి. "బాగుంది! వెరీ గుడ్!" అంది.

ఆ క్షణాన అతని ముఖంలో ఆనందం, కనీనం ఒక చిరునవ్వు, కనీనం పెదవి చివరన ఒక కదలిక కలిగి ఉంటే క్లెయిర్‌కు బా గుండేది.

అతను ఇంగ్లీష దొరలాగ కదలక మెదలక నిలుచున్నాడు. "థాంక్యూ! మిసెస్ బెల్మాంట్! లివింగ్ రూంలోకి వచ్చి చూడండి."

ఆమె అలాగే చేసింది. "ఏమిటి? ఫర్నిచర్ అంతా పాలిష్ చేశావా?"

"బా గుందా, మిసెస్ బెల్మాంట్!"

"ఇంతకూ ఎప్పుడు చేశావు? ని న్నయితే కాదు!"

"రాత్రి చే శానండి!"

"అంటే రాత్రంతా లైట్లు వేసుకుని కూర్చున్నావా?"

"లే దండీ! నా కా అవసరం లేదు. నాకు అల్ట్రా వయొలెట్ సోర్స్ ఉంది. నేను చీకట్లో కూడా చూడగలను. పైగా, నాకు నిద్ర కూడా అవసరం లేదు!"

'ఆశ్చర్యం అనవసరం!' అనుకుంది క్లెయిర్. ఏం చేస్తే ఆమెకు సంతృప్తి కలుగుతుందో అతనికి తెలియాలి. ఆమె ఆ క్లూ మాత్రం ఇవ్వడం లేదు.

"మీ లాంటి వాళ్లు ఉంటే, మామూలు రకం పని మనుషుల సంగతి చెట్టెక్కినట్టే!" అని మాత్రం అంది.

"వారు చేయడానికి ఇంకా గొప్ప గొప్ప పను లుంటాయండి. ఈ మాత్రానికి మనుషులు కావాలా? నాలాంటి వస్తువులను తయారు చేసుకోవచ్చు. అంతేగానీ, మీలాంటి మనుషుల మెదడును పోలింది మరోటి ఉం దంటారా?

అతని ముఖంలో ఆ మాటల తాలూకు భావాలు, ఛాయలేమీ లేవు. గొంతులో మాత్రం గొప్ప ఆరాధన ధ్వనించింది. క్లెయిర్ ముఖం ఎర్రబడింది. "నా తలకాయ!"

టోనీ ఒ కడుగు ముందు కేశాడు. "అలా గన్నారంటే మీ కేదో బాధగా ఉందని అర్థం. నా వల్ల నయేదేమయినా ఉందా, మిసెస్ బెల్మాంట్!"

క్లెయిర్‌కి ఒక క్షణం న వ్వాలనిపించింది. అ దొక విచిత్రమయిన పరిస్థితి. ఇల్లు ఊడ్చి, గిన్నెలు తోమి, కుర్చీలకు పాలిష్ పెట్టి పని చేస్తూ ఉండాల్సిన ఒక యంత్రం తనను ఓదార్చడానికి, మనస్థైర్యం ఇవ్వడానికి ముందుకు వస్తున్నది.

"నాకూ ఒక మెద డుందని బెల్మాంట్ గారు అనుకోరు తెలుసా? నేనూ అలాగే అనుకుంటానేమో...." అప్రయత్నంగా అనేసింది. అతని ముందు ఏడవడం బా గనిపించలేదు. ఈ యంత్రం ముందు మనిషి జాతి గౌరవాన్ని మంట గలుపుతా ననిపించింది ఆమెకు.

"అతను చదువుకునే రోజుల్లో బాగానే ఉండే వారు. ఈ మధ్యనే మొదలయింది. నేను గొప్ప వ్యక్తికి భార్యగా పనికి రాను గదా; అత నేమో గొప్ప వా డయి పోతున్నాడు. నేను కేవలం పని మనిషిగా ఉండి పోవాలి. పైగా గ్లా...గ్లా...గ్లాడిస్ క్లావర్స్ లాంటి అమ్మాయిలను ఆయన గారికి దోస్తీ చేయాలి!"

ఆమె ముఖం ఎర్రనయింది. కానీ, టోనీ మాత్రం ఆమె కేసి చూడడం లేదు. అతను గదిని కలియజూస్తున్నాడు. "ఈ ఇంటి పనులన్నీ నేను చేసి పెట్టగలను!"

"దాంతో ప్రయోజనం లేదు. నేను చేయలేని దేదో ఇందులో ఉంది. ఉన్నదాంట్లో నదుపాయంగా నర్ద లను గానీ, హోమ్ బ్యూటిఫుల్ పత్రికల్లో బొమ్మల్లాగ నయితే చెయ్యలేను గదా!

"మీకు అలాగ ఉండాలని ఉందా?"


"ఉంది. ఉండగానే ఏ మవుతుంది?"

"నేను సాయం చెయ్యగలను!"

"నీకు ఇంటీరియర్ డెకొరేషన్ కూడా తెలుసా?"

"ఇంటి పనులు చూచుకునే వారికి తెలిసి ఉండాల్సిన విషయమా అది?"

"అవును!"




"అయితే నేర్చుకునే శక్తి నా కుంది. అందుకు సంబంధించిన పుస్తకాలు తెచ్చి పెట్టగలరా?"

ఒక కొత్త కార్యక్రమం మొదలయింది.

పబ్లిక్ లైబ్రరీ నుండి హోమ్ ఆర్ట్‌కు సంబంధించిన రెండు పెద్ద పెద్ద పుస్తకాలను మోసుకువచ్చింది క్లెయిర్. టోనీ పుస్తకం తెరిచి చూస్తుంటే గమనిస్తూ ఉండిపోయింది. అతని వేళ్లు కదులుతుండగా చూడడం అదే మొదటిసారి!

ఆ వేళ్లకు ఆ శక్తి ఎలా వచ్చిందోనని ఆశ్చర్యపోయింది. అనుకోకుండా చటుక్కున చేయి చాచి అతని వేళ్ల నందుకుని తన వేపు లాక్కుంది. టోనీ అడ్డు చెప్పలేదు. పరిశీలించమన్నట్లు తన చేతిని ఆమె చేతిలో ఉంచాడు.

"ఆశ్చర్యం! నీ గోళ్లు కూడా చాలా సహజంగా ఉన్నాయి" అంది క్లెయిర్.

"కావాలనే అలా చేశారండీ" అన్నాడు టోనీ. "నా చర్మం సాగే లక్షణం గల ప్లాస్టిక్‌తో చేసింది. లోపలి భాగాలేమో తేలికయిన మిశ్రమలోహంతో చేసినవి. మీకు వింతగా అనిపించడం లేదూ!"

"లేదు లేదు!" ఆమె తల ఎత్తింది. ముఖం ఎర్రబడి ఉంది. "నీ విషయాలను గురించి మరీ లోతుగా ఆరాలు తీస్తున్నానేమో ననిపించింది. అంతే! ఇలాంటి విషయాలతో నా కేమిటి పని. ను వ్వెప్పుడూ నా గురించి అడగలేదే?"

"నా మెదడులోని కనెక్షన్‌లలో అటువంటి కుతూహలం చూపించే ఏర్పాట్లు లే వండీ! నేను చేసే పను లన్నింటికీ నియమ నిబంధన లున్నాయి."




ఆ తరువాతి కా సేపు నిశ్శబ్దం.

క్లెయిర్ లోపలేదో విచిత్రమయిన భావన.

అతను కేవలం ఒక యంత్రమనే మాట త నెందుకు అస్తమానం మరిచిపోతుంది?

ఆ యంత్రమే ఆ సంగతిని తనకు గుర్తు చేయడమా?

తన పట్ల సానుభూతి చూపే వా రెవరూ లేరు.

ఈ యంత్రం ఆ పని చేస్తోంది.

అందుకని తను యంత్రాన్ని కూడా తనతో సమంగా ఊహించగలుగుతోందా?

క్లెయిర్ ఆలోచిస్తోంది.

అతను మాత్రం పేజీలు తిప్పుతూనే ఉన్నాడు. యాంత్రికంగా క్లెయిర్‌కు తన ఆధిక్యత గుర్తొచ్చి నట్లుంది. "నీకు చదవడం వచ్చునా? రాదు కదూ!"

టోనీ తల పైకెత్తాడు. అతని గొంతులో కూడా ఏ భావమూ లేదు.

"నేను చదువుతున్నాను మిసెస్ బెల్మోంట్!"

"కానీ".... క్లెయిర్ పుస్తకం కేసి చూపింది.

"ఓహో! అదా మీ అనుమానం. నేను పేజీలను స్కాన్ చేస్తున్నాను. చదవడమంటే నాకు వరుస వరుసతో పని లేదు. పేజీ నంతా ఫోటోలా గుర్తుంచు కోగలను."

అప్పు డది సాయంత్రం. క్లెయిర్ నిద్రకు ఉపక్రమించే సమయానికి టోనీ రెండో పుస్తకం చదువుతున్నాడు. అతను చీకట్లో చదువుతున్నాడు. లేదా కనీసం క్లెయిర్ కళ్లకు అది చీకటిగా కనబడుతోంది.

నిద్రలోకి జారుకునే సమయంలో క్లెయిర్ మెదడులో లీలగా గోచరించిన చిత్రం అతని చేతులు. వాటి స్పర్శ. ఆ చేతులు వెచ్చగా, మృదువుగా ఉన్నాయి. అచ్చుగా మనిషి చేతుల్లాగే.

ఆ కంపెనీ వాళ్లు ఎంత తెలివిగల వాళ్లు అనుకుంటూ ఆమె నిద్రలోకి జారింది.

** ** **

ఆ తర్వాత కొన్ని రోజులు లైబ్రరీ కార్యక్రమం నడిచింది. టోనీ ఒక దాని తర్వాత ఒకటి పుస్తకాలు, విషయాలను ఎంపిక చేసి సూచిస్తున్నాడు. రంగుల గురించి, కాస్మెటిక్స్ గురించి, వడ్రంగి గురించి, ఫాషన్‌ల గురించి, దుస్తుల గురించి, ఆర్ట్ గురించి..... ఇంకా ఎ న్నెన్నో.

అతను పేజీలు తిప్పుతున్నాడు. అంటే చదువుతున్నాడు. అతనికి మరిచిపోవడం చేత కాదు.

వారం గడిచే లోపల టోనీ క్లెయిర్‌ను జుట్టు కత్తిరించుకునేందుకు ఒప్పించింది. కొత్త తరహా ఆమె జుట్టును అలంకరించాడు. కనుబొమ్మలు సర్దాడు. వాడుకునే పౌడరు, లిప్‌స్టిక్‌ల రంగులు మార్చాడు.

ఆమె అరగంట పాటు ఆ మర మనిషి చేతులను భయంగా సహించింది. ఆ తర్వాత అద్దంలో చూచుకుంది.

"ఇంకా చేయవలసిం దెంతో ఉంది" అన్నాడు టోనీ." ముఖ్యంగా మీ దుస్తుల విషయంలో. ఏమయితేనేం మొదలు పెట్టాం. ఎలాగుంది మీకు?"

ఆమె చాలా సేపు దాకా జవాబు చెప్పలేదు. అద్దంలో కనిపించే ఆ కొత్త రూపం అర్థమయి, ఆ తాలూకు ఆశ్చర్యం ఆరిపోయే దాకా! అప్పు డయినా, అద్దం మీద నుండి దృష్టి మరలించకుండానే - "అవును, టోనీ, ప్రారంభం చాలా బాగుంది!" అంది. ఆమె గొంతు పూడుకుపోతోంది.

లారీకి రాసిన ఉత్తరాల్లో ఆమె ఈ విషయాలేవీ రాయనేలేదు. అతను ఒకే సారి చూడాలి. ఆశ్చర్యంలో మునిగి తేలాలి. అప్పుడు తను అనుభవించేది అందులోని ఆశ్చర్యం ఒకటే కాదు. ప్రతీకారం కూడా కొన్త కలుస్తుం దనిపించింది.

"కొన్ని వస్తువులు కొనాలి. నే నేమో ఇల్లు కదిలి వెళ్లడానికి వీల్లేదు. నేను లిస్టు వేసి ఇస్తే కచ్చితంగా అవే రకం సరుకులు, సామాన్లు కొని తేగలరా? కర్టెన్ గుడ్డలు కావాలి. వాల్ - పేపర్, కార్పెట్లు, పెయింటు, దుస్తులకి కావలసివన్నీ .... ఇంకా బోలెడు కావాలి" అన్నా డొకరోజు టోనీ.

"ఇన్ని చెప్పి ఒక్క సారిగా - అదీ అన్నీ నీ ఇష్టానికి సరిపడా తేవాలంటే కష్టమే" అంది క్లెయిర్ అనుమానపడుతూ.

"కొంచెం పాటి తేడా లొచ్చినా పరవాలేదు. కా నయితే బజార్లన్నీ తిరగడం అవసరం. డబ్బు ఒక సమస్య కాకుండా ఉండాలి మరి!"

"కానీ, టోనీ, డబ్బు సమస్య కాకుండా ఎలా ఉంటుంది?"

"ఉండే మార్గం ఉంది. దార్లో ముందు యు.ఎస్.రోబోస్ ఆఫీసుకు వెళ్లండి. నే నొక చీటీ ఇస్తాను. డా॥ కాల్విన్ గారికి ఇవ్వండి. ఇది ప్రయోగానికి ఎంతో అవసరమని నే నన్నానని చెప్పండి!"

**  **  **

మొదటి రోజు లాగ, డా॥ కాల్విన్‌ను చూస్తే భయం మాత్రం వేయలేదు. తన ముఖం మారింది, హంగులు మారాయి. తా నిప్పుడు మునుపటి క్లెయిర్ కాదు. కాల్విన్ చెప్పిం దంతా విన్నది. కొన్ని ప్రశ్న లడిగింది. తల ఊపింది. క్లెయిర్‌కి కావలసినంత షాపింగ్ చేసే వీలు కలిగింది. బిల్లులన్నీ కంపెనీ వారు చెల్లిస్తారు.

డబ్బు శక్తి వర్ణనాతీతం. దుకాణదారు ముందు బిక్క మొహం వేయాల్సిన అవసరం తన కిప్పుడు లేదు. ఎవరూ తనను చూసి కళ్లెగరేసే ప్రసక్తే లేదు.

అన్నిటికంటే పెద్ద బట్టల దుకాణంలో ప్రవేశించింది. చీటీ చూపించింది. షా పతను కాసేపు తబ్బిబ్బయాడు. ఇంకా వివరాలుంటే, మార్పులతో సర్దగల నన్నాడు. క్లెయిర్ ఇంటికి ఫోన్ చేసి రిసీవర్ సేల్స్‌మన్ చేతి కందింది. "ఏమీ అనుకోకపోతే ..... నా ..... సెక్రెటరీతో మాట్లాడండి!"

షా పతను ఫోను సుతారంగా అందుకున్నాడు... "ఎస్" అన్నాడు. కా సేపు విని మళ్లీ "ఎస్" అన్నాడు. ఇం కాసేపు విన్నాడు. మధ్యలో అతని ముఖంలో ఏదో అడ్డు చెప్పాలన్న భావం వచ్చినట్లే వచ్చి మాయమయింది. కా సేపయ్యాక "ఎస్" అని ఫోన్ పెట్టేశా డతను.

"అమ్మ గారు ఇటుగా వస్తే మీ వస్తువులు ఇవ్వడానికి ప్రయత్నిస్తాను." అతని ముఖంలో ఏదో ఓటమి లాంటి బాధ ధ్వనించింది.

"ఒక్క నిమిషం." క్లెయిర్ ఫో నందుకుని మరో సారి డయల్ చేసింది. "టోనీ! నీ వేం చెప్పావో గానీ, అ దేదో బాగానే పని చేసింది. థాంక్యూ. యు ఆర్ ఎ".... క్షణం పాటు. సరియయిన మాట కోసం కాసేపు వెదికి, ఓడిపోయి...పీలగా... "డియర్!", అంది.

ఫోను పెట్టేసి ఇటు తిరిగే సరికి ఎదురుగా గ్లాడిస్ క్లాఫర్న్. ఆమె మొహంలో కసింత ఆశ్చర్యం, కసింత సరదా! తల కొన్త ఒక పక్కకు వంచి చూస్తోంది.

"మిసెస్ బెల్మాంటేనా?"

క్లెయిర్ జావగారినంత ప నయింది. తను వెర్రిగా - తల ఊపింది. అంతే.

గ్లాడిస్ అ దోలా నవ్వింది. "మీరు ఇక్కడ షాపింగ్ చేస్తారని తెలీదే!" అంది. అక్కడికి ఆ కొట్టు గౌరవమేదో గంగలో కలిసిపోయినట్లు.

"సాధారణంగా రాను లెండి!" అంది క్లెయిర్ వినమ్రంగా.

"మీ జుట్టు ఏదో మారినట్లుంది. తమాషాగా ఉంది.... ఓహ్! తప్పుగా అనుకోకండి. మీరు లారెన్స్ గారి భార్యే కదూ! నా కయితే అలా గనిపిస్తోంది!" అంది గ్లాడిస్.

క్లెయిర్ పళ్లు బిగబట్టింది. అయినా ఏదో చేయాలి. "టోనీ అని మా వారి నేస్తం ఉన్నారు. అతను ఇక్క డేవో కొనమంటేనూ...."


"తెలిసింది! కొంచెం బాగానే తెలుస్తోంది కూడా!" ఆవిడ ప్రపంచంలోని వెలుగు, వెచ్చదనాలను తనతోనే తీసుకుపోతున్నట్లు హుందాగా వెళ్లిపోయింది.

ఓదార్పు కోసం తా నిప్పుడు టోనీని ఆశ్రయిస్తున్నదన్న విషయం క్లెయిర్‌కి అంతగా బాధ కలిగించడం లేదు. పది రోజుల్లో ఆమెలోని సంకోచం మటు మాయ మయింది. ఆమె ఇప్పుడు అతని ముందు ఏడుస్తోంది. మరీ మరీ ఏడుస్తోంది.

"స న్నా పిచ్చిదాని కింద జమ కట్టింది. తను ఎప్పుడూ అంతే. ఎందుకో మరి. నేను దాన్ని తన్నాల్సింది. కింద పడేసి నాలుగు ఇచ్చుకుంటే సరిపోయేది"

"ఒక మనిషి మరో మనిషిని ఇంతగా ద్వేషించడం వీలవుతుందా?" టోనీ అనుమానంగా ప్రశ్నించాడు. "నాకు మనిషి మెదడులోని ఈ అంశం గురించి తెలీదు!"

"ఇందులో ఆవిడ త ప్పేముంది? త ప్పంతా నాదే ననుకుంటాను!



నేను ఆవిడ లాగ, కనీసం చూపుల కయినా ఉండాలనుకుంటాను. కానీ ఉండలేను."

టోనీ గొంతు తక్కువగా ఉన్నా అందులో ఏదో బలం వినిపిస్తోంది. "తప్పకుండా ఉండగలరు మిసెస్ బెల్మాంట్! తప్పకుండా ఉండగలరు, మనకు ఇంకా పది రోజుల వ్యవధి ఉంది. ఈ పది రోజుల్లో ఇల్లు ఎలాగూ ఇట్లా ఉండదు. మనం ఆ వివరాలన్నీ ఆలోచిస్తూనే ఉన్నాం గద!"

"దీంతో ఆవిడ కేమవుతుంది?"

"ఆవిడను ఇక్కడకు పిలవండి. ఆవిడ ఫ్రెండ్స్ నందరినీ పిలవండి. నేను... వెళ్లిపోయేకంటే ఒక రోజు ముందు సాయంత్రం పార్టీ ఏర్పాటు చేద్దాం."

"ఆవిడ గారు రారు!"

"వస్తుంది. ఆవిడే వస్తుంది. మిమ్మల్ని చూచి నవ్వుకుందామని వస్తుంది. కానీ ఆవిడకు అది చేతగాదు."

"నిజంగా నంటావా? మనం నిజంగా అలా చేయగలమంటావా, టోనీ?" ఆమె అతని రెండు చేతులను తన చేతుల్లో పట్టుకుంది. "అయినా నాకు ఒరిగే దేముంది. అంతా నిన్ను చూచి ఆశ్చర్యపోతా రు. నే నెంత కాలం నీ మీద ఆధారపడగలను?"

"ఎవరూ తమంతకు తామే ఏదీ సాధించలేరు. నా కీ విషయాన్ని ముందే మెదడులో అమర్చి ఉంచారు. మీరు గానీ, మరొకరు గానీ ఆ గ్లాడిస్ గారిలో చూస్తున్నది కేవలం గ్లాడిస్‌ను మాత్రమే కాదు. డబ్బు, హోదాల మీద

ఆవిడ వ్యక్తిత్వం ఆధారపడి ఉంది. ఆవిడ అందుకేమీ బాధపడడం లేదు! అలాంటప్పుడు మీరు నా మీద ఆధారపడడానికి ఎందుకు సందేహించాలి. పోనీయండి, మిసెస్ బెల్మాంట్!


" ఇం కోలా చూడండి. చెప్పిన పనినల్లా చేసే రీతిగా నన్ను తయారు చేశారు. అయితే పని వినడానికి నా నియమాలు మాత్రం నావే. నేను తు.చ. తప్పకుండా ఆజ్ఞలు పాటించగలను. అందులో కొంత సడలింపులు కూడా చేయగలను. మీ మాటలను నేను సంపూర్తిగా శిరసా వహిస్తాను. నాకు మీరు ఆదర్శ మానవ మూర్తులు. ప్రేమ, స్నేహం, ఆదరణ - ఇవన్నీ మీలో నేను చూస్తున్నాను. మీరు చెబుతున్న దాన్నిబట్టి చూస్తే మిసెస్ క్లాఫర్న్ ఆ విధంగా ఉండరు. సింపుల్! నే నావిడ మాటలను అంతగా వినను! అందుకని ఈ తతంగాన్ని నడిపించేది మొత్తం నేను కాదు.. మీరే, మిసెస్ బెల్మాంట్... కేవలం మీరు!"

అతను తన చేతులను ఆమె చేతుల్లోంచి తీసుకున్నాడు. ఎవరికీ, ఏ భావమూ కనబడని అతని ముఖంలోకి ఆమె చూచింది. ఆశ్చర్యంగా! ఆవిడను ఉన్నట్లుండి ఒక కొత్త రకమయిన భయం కమ్ముకుంది.

**ఒక్క సారి ఆమె తన చేతుల కేసి చూసుకుంది.. అతని స్పర్శ తాలూకు పులకరింత ఇంకా ఆ చేతుల్లో మిగిలిన ట్లనిపించింది. ఆవిడ ఊహించలేదు. అతను సుతారంగా, ఆప్యాయంగా తన వేళ్లను నొక్కి వదిలేశాడు. అతని వేళ్లు... కాదు.... ఆ యంత్రం చేతులు.... దాని చేతులు .... దాని వేళ్లు....**

**ఆవిడ బాత్ రూంలోకి పరుగెత్తి పిచ్చిగా చేతులను కడుక్కుంది.**

మరు రోజు అతని ఎదుట పడాలంటే సిగ్గని పించింది. అతడిని




తప్పించుకుంటూ ఏం జరుగుతుందా అని వేచి చూచింది. కొంత సేపటి వరకూ ఏమీ జరగలేదు.

టోనీ పని చేసుకు పోతున్నాడు. రంగులు వేయడం, వాల్ పేపర్ అతికించడం పారపా ట్లెలాగుంటాయో తెలియకుండా జరిగిపోతున్నాయి. అతని చేతులు చకచకా కదులుతున్నాయి. ఆ వేళ్లలో నైపుణ్యం కనపడుతోంది.

అతను రా త్రంతా పని చేస్తున్నాడు. ప్రతి ఉదయం కొత్తగా కనబడుతోంది. ఎన్ని మార్పులు వచ్చాయో గమనించడం ఆమెకు కుదరడం లేదు. సాయంత్రం కల్లా మరి కొంత పని. మళ్లీ మరో రాత్రి.

తను కూడా సాయం చేయాలని కేవలం ఒకసారి ప్రయత్నించింది. "మనిషి" మొరటు తనంతో పని పా డయింది. "అతను" పక్క గదిలో ఉన్నాడు. టోనీ ముందుగానే గుర్తు పెట్టిన చోట పెయింటింగ్ ఒకటి వేలాడదీయాలని ఆమె ప్రయత్నించింది. గోడ మీద గుర్తు ఉంది. పక్కనే పెయింటింగ్ ఉంది. ఊరికే కూచోవడం ఎందుకన్న భావన కూడా ఉంది!

కానీ ఆమె పరిస్థితి బా గున్నట్లు లేదు. లేక నిచ్చెన బాగు లేదో? ఏ దయితేనేం, ఆమె జారి పడింది. పడుతూ నిస్సహాయంగా కేక వేసింది. నిచ్చెన పడింది. క్లెయిర్ మాత్రం పడలేదు. రక్తమాంసాల మనిషికంటే ఎంతో వేగంగా టోనీ పరుగెత్తుకు వచ్చి ఆమెను అందుకుని పొదివి పట్టుకున్నాడు. అతడి కళ్లలో ఏ భావం లేదు. అతని గొంతు మాత్రం మృదువుగా అడిగింది. "దెబ్బ తగిలిందా, మిసెస్ బెల్మాంట్?"

ఆమె పడుతూ పడుతూ చేతిని టోనీ తలకు తగిలించిందని తోచింది. వెంట్రుకలు మామూలు వెంట్రుకల లాగే ఉన్నాయని తొలి సారిగా తెలిసింది. అతను తనను ఇంకా రెండు చేతుల్లోనూ ఎత్తి గట్టిగా అదిమి పట్టుకుని ఉన్నాడని క్లెయిర్‌కి అప్పటికిగానీ తోచలేదు.

ఆమె విదిలించుకుంది. అప్పుడు అరిచిన అరుపు ఆమె చెవుల్లో ఇంకా గింగురుమంటున్నది. రోజంతా తన గదిలోనే గడిపింది. రాత్రి తలుపు వేసి మరో కుర్చీని అడ్డుగా పెట్టింది కూడా!

అందరికీ ఆహ్వానాలు అందాయి. టోనీ చెప్పినట్లే, అందరూ రావడానికి అంగీకరించారు. ఇక 'ఆ సాయంత్రం ఎప్పుడా' అని వేచి చూడడమే ఆలస్యం!

అన్ని సాయంత్రాలు గడిచిన తర్వాత, దాని స్థానంలో, ఆ సాయంత్రం కూడా రానే వచ్చింది. ఇల్లు తన ఇంటి లాగ కనబడడం లేదు. మొత్త మంతా ఒక సారి కలియ తిరిగింది. ప్రతి గది కొత్త రూపంలో ఉంది. తను కూడా ఇంతకు ముందు ఊహకు కూడా అందని రకం దుస్తుల్లో ఉంది. ఆ దుస్తులతో బాటే గొప్ప ఆత్మస్థైర్యం, గౌరవాలను కూడా ధరించినట్లుంది.

అద్దం ముందు నిలబడి, ఏదో అమాయకంగా కనబడాలని ప్రయత్నించింది. కానీ అద్దం వెక్కిరించి నట్లనిపించింది.

లారీ ఏ మంటాడో? ఏ మంటేనేమి? రానున్నవి గొప్ప రోజులు కాదు. ఆ మంచి రోజులేవో టోనీతోనే వెళ్లిపోతాయి. ఇ దేదో వింతగా అనిపించింది. మూడు వారాల క్రిందటి పరిస్థితిని గుర్తు చేసుకోవా లనుకున్నా లాభం లేకుండా ఉంది.

** ** **

గడియారం ఎనిమిది గంటలను, ఎనిమిది వాయిదాలుగా వినిపించింది., క్లెయిర్‌కు ఊపిరి ఆడనంత ప నయింది. "ఇక వాళ్లు వచ్చేస్తారు. టోనీ! నీవు బేస్‌మెంట్‌లోకి వెళ్లి పోతావా? వాళ్లు గనక వచ్చేస్తే...."

ఆమె ఒక క్షణం చూచింది. బలహీనంగా "టోనీ?" అంది. మరింత గట్టిగా "టోనీ?" ఈ సారి అరిచింది "టోనీ!"

అప్పటికే ఆమె అతని చేతుల్లో బందీగా ఉంది. అతని ముఖం ఆమె ముఖానికి చేరువగా ఉంది. అతని కౌగిలి పట్టు సడలడం లేదు. కలగలిసిన భావాలు ముంచెత్తుతుంటే చెవుల్లో అతని మాటలు మెత్తగా సోకుతున్నాయి. "క్లెయిర్! చాలా విషయాలు నాకు అర్థం కాకుండా ఉండేలా ఏర్పాటు చేశారు. బహుశః ఇది కూడా వాటిలో ఒక టనుకుంటాను. నేను రేపు వెళ్లిపోతాను. కానీ నాకు పోవా లనిపించడం లేదు. నిన్ను సంతృప్తి పరచడం కన్నా బలమయిన భావన నాలో ఉం దనిపిస్తున్నది. విచిత్రంగా ఉంది కదూ!"

అతని ముఖం మ రింత చేరువయింది.

అతని పెదవులు వెచ్చగా ఉన్నాయి.

అయితే వాటి వెనకాల ఊపిరి మాత్రం లేదు.

యంత్రాలకు ఊపిరి అవసరం లేదాయె!

పెదాలు ఆమె పెదాలను తాకాయి.

...... డోర్ బెల్ మోగింది.

ఒక క్షణం ఆమె సర్దుకుంది. అతను చటుక్కున జారుకున్నాడు. మళ్లీ బెల్ మోగింది.

ముందు కిటికీ తెరలు తెరుచుకుని ఉన్నాయి. కా సేపటి క్రితం అవి మూసుకుని ఉన్నట్లు గుర్తుంది. ఆమెకు బాగా గుర్తుంది.

అయితే వాళ్లు చూచే ఉంటారు. వా ళ్లందరూ... అంతా... చూచి ఉంటారు.

*** *** ***

అందరూ గుంపుగా, గౌరవంగా లోపలికి వచ్చారు... వేటకు వచ్చిన వాళ్లలా వాళ్ల కళ్లు గుచ్చి గుచ్చి చూస్తు న్నట్లున్నాయి. వాళ్లు తప్పకుండా చూచారు. లేకుంటే గ్లాడిస్ లారీ గురించి మరీ అంతగా ఎందుకు ఆరా తీస్తూ అడుగుతుంది. క్లెయిర్‌కి లోపల గొప్ప నిర్లక్ష్య భావం పొడ సూపింది.

అవును! ఆయన లేడు. రేపు వస్తాడు. నాకు ఒంటరిగా అనిపించడం లేదు. నాకేం? హాయిగా కాలం గడుస్తోంది. క్లెయిర్ వాళ్లను చూచి నవ్వింది. ఎందుకు నవ్వకూడదు? వాళ్లేం చెయ్యగలరు? లారీకి నిజం తెలుస్తుంది. వాళ్లు చూచామనుకుంటున్న సంగతిని గురించి, అంతేగద!

వాళ్లు మాత్రం నవ్వలేదు.

గ్లాడిస్ క్లాఫర్న్ కళ్లలోనూ, మాటల తీక్షణతలోనూ, ఆవిడ త్వరగా వెళ్లిపోవాలని చేసిన ప్రయత్నంలోనూ స్పష్టంగా కనబడుతునే ఉంది. వెళుతూ, వెళుతూ చివరకు చెవిలో ఒకే ఒక మాట గునగున లాడింది.

"ఇంత అందగాణ్ణి ఇంతకు ముం దెప్పుడూ చూడలేదు"

వాళ్లందరికి మనసులు విరిచేసిన విషయమేమిటో ఆమెకు తెలిసిపోయింది. ప్రతి ఒకళ్లకీ తెలియాలి. వాళ్లు క్లైయిర్ బెల్మాంట్ కంటె అందంగా ఉం డొచ్చు, ధనవంతురాలు కావచ్చు, గొప్ప దొవచ్చు!

కానీ ఒక్కరికి...

ఒకరికి కూడా

ఇంత అందగాడయిన లవర్ మాత్రం లేడని అందరికీ తెలిసి రావాలి!

అప్పుడు క్లైయిర్‌కు టోనీ మనిషి కాడని మళ్లీ మళ్లీ గుర్తుకొచ్చింది. టోనీ ఒక యంత్రం. ఆవిడకు ఒంటి మీద ఏదో పాకి నట్లనిపించింది.

"పొండి! న న్నిలా వది లేయండి!" గట్టిగా అరుస్తూ ఆమె పడక గది చేరుకుంది. రా త్రంతా మెలకువగానే ఉండి పోయింది... ఏడుస్తూ.....! తెలవారుతుందనగా ఇంటి ముందు కారొకటి వచ్చి ఆగింది. టోనీని తీసుకెళ్లింది.

*** *** ***

లారెన్స్ బెల్మాంట్, డా॥ కాల్విన్ గది ముందుగా వెడుతున్నాడు. ఉన్నట్లుండి. ఆగిపోయి, గది తలుపు తట్టాడు. ఆవిడతో బాటు గణిత నిపుణుడు పీటర్ బోగార్ట్ ఉన్నాడు. అయినా లారీ లోపలికి వెళ్లిపోయాడు.

"ఇంట్లో జరిగిన ఖ ర్చంతా యు.ఎస్.రోబోస్ వారే ఇచ్చారట గదా? క్లైయిర్ చెప్పింది...."

"అవును. అది నీ జీతం లెక్కలోకి రాదులే. పరిశీలన ఖర్చు కింద రాసేశాం. అసోసియేట్ ఇంజనీరు వయ్యారగా. ఆ ఇల్లు నీకు భారమేమీ కాదనుకుంటాను."

"అది కాదు నా ప్రశ్న. వాషింగ్‌టన్ వారు పరీక్షలకు అంగీకరించారు. అంటే వచ్చే ఏడాది కల్లా మన టి.ఎన్.మోడల్ పనిలోకి వచ్చేస్తుందనే నేననుకుంటున్నాను." అతను వెళ్లిపోతున్న వాడిలాగ వెనుదిరిగాడు. అయిష్టంగానే వెనక్కి చూశాడు.

"ఏమిటి, మిస్టర్ బెల్మాంట్?" అడిగింది డాక్టర్ కాల్విన్.

"నా కేమిటో ఆశ్చర్యంగా ఉంది. ఆ ఇంట్లో ఏం జరిగిందో అర్థం కావడం లేదు. తను... అంటే నా భార్య క్లైయిర్.... ఏదో వేరుగా కనబడుతోంది. కేవలం రూపమే కాదు.... నిజం చెపుతున్నాను. నాకు ఆశ్చర్యంగా ఉంది." అతను బలహీనంగా నవ్వాడు. "ఆవిడ మారిపోయింది..... తను నా భార్యేనా అనిపిస్తోంది... నిజంగా... చెప్పలేకుండా ఉన్నాను."

"ఎందుకూ చెప్పడం. ఆ మార్పులో ఏ భాగమయినా మీకు ఇష్టం లేకుండా ఉందా?"

"అ దేమీ లేదు. కానీ ఏదో భయంగా అనిపిస్తోంది... యూ సీ!..."

"పట్టించు కోనవసరం లేదు, మిస్టర్ బెల్మాంట్. మీ ఆవిడ చాలా బాగా సహకరించారు. నిజంగా చెప్పాలంటే, ఈ ప్రయోగం వల్ల ఇంత విశదమయిన ఫలితాలు అందుతాయని నేను ఊహించలేదు. టి.ఎన్.మోడల్‌లో సరిగ్గా ఏయే మార్పులు అవసరమో పూర్తిగా తెలిసిపోయింది. ఇందుకు కారణం కేవలం మిసెస్ బెల్మాంట్. నిజంగా చెప్పాలంటే ఈ ప్రమోషన్‌కు మీ కన్నా మీ భార్యే ఎక్కువగా అర్హురాలు!"

లారీలోని భావాలు ఇప్పుడు బయటకు కనబడ్డాయి. "ఇద్దరిలో ఎవరి కయితేనేం?" అంటూ వెళ్లిపోయాడు.

*** *** ***

"నొచ్చుకు న్నట్లున్నాడు" డా॥ కాల్విన్ అంది. "పీటర్! మీరు టోనీ రిపోర్టు చదివా రనుకుంటాను.!"

"అక్షరం వదలకుండా!" అన్నాడు పీటర్. "టి.ఎన్ మోడల్‌లో మార్పులు అవసరం కదూ!"

"మీ కూడా అలాగే అనుకుంటున్నారా?" అడిగింది కాల్విన్. "ఎందుకని?"

బోగర్ట్ భుజా లెగరేశాడు. "ఎందుకనా? యజమానురాలికి ప్రేమ పాఠాలు నేర్పించే రకం మరమనుషులను బజారులోకి వదలడం కుదరదని, రిపోర్టు చూచిన మొదటి క్షణంలోనే తెలిసి పోతుంది గద!"

"ప్రేమా? పీటర్! విచిత్రంగా మాట్లాడుతున్నావు. నీ కసలు సంగతి అర్థం కాలేదు. ఆ యంత్రం "తొలి నియమాన్ని" పాటించ వలసి ఉంది. పాటించింది. మనుషులకు హాని కలుగుతూ ఉంటే రోబో చూస్తూ ఊరుకోకూడదు. క్లైయిర్‌కి తన మీద తనకున్న చిన్న చూపుతో హానీ కలుగుతోంది. అందుకనే అతను ఆమెను అన్ని రకాల సంతృప్తి పరచాడు. హృదయం లేని ఒక యంత్రానికి కూడా ప్రేమ నేర్పించడం గొప్పనే విషయం అర్థమయేది కాదు.

అతను ఆ సాయంత్రం, కావాలనే కర్టెన్లను తొలగించి ఉంచాడు. మిగతా వాళ్లు చూడాలి. అసూయ పడాలి. కానీ క్లైయిర్ సంసారానికి హాని కలుగ కూడదు. టోనీ చాలా తెలివిగా ప్రవర్తించా డంటాను నేను -"

"నిజంగానా? నటనకు, నిజానికి భేదం ఎక్కడ? సూసన్! ఇంతకూ జరిగిం దాని వల్ల ఏర్పడే ఫలితాలను గురించి ఊహించావా? రిపోర్ట్ మరొక సారి చదివి చూడు! ఆమె టోనీని తప్పించుకు తిరిగింది. అతను పట్టుకుంటే, ఆమె గట్టిగా అరిచి కేకలు వేసింది. ఆమె ఆ రాత్రంతా నిద్రపోలేదు... ఇలాంటి వన్నీ పరవా లే దంటావా?"

"పీటర్! నువ్వు గుడ్డి వాడివి. నీలాగే నేనూ ఒ కప్పుడు ఆ విషయాన్ని గ్రహించలేకపోయాను. టి.ఎన్ మోడల్‌ను పూర్తిగా మార్చి నిర్మించాలి. కానీ, నీవు చెప్పిన కారణాల వల్ల మాత్రం కాదు. పూర్తిగా వేరే కారణాలు! పూర్తిగా వేరు! ఆ విషయాలు నాకు మొదట్లో ఎందుకు తోచ లే దనేది నాకే ఆశ్చర్యంగా ఉంది."

ఆవిడ శూన్యంలోకి చూస్తూ ఒక క్షణం ఆలోచిస్తూ ఉండిపోయింది.

"బహుశా నా లోని లోపం వల్లే ఇలా జరిగిందేమో ననిపిస్తోంది. నిజమే, పీటర్! యంత్రాలు ప్రేమలో పడడానికి లేదు.... కానీ అర్థం లేని వింత పరిస్థితుల్లో కూడా.... ఆడవాళ్లు మాత్రం ఆ ప్రమాదానికి గురవుతారు!"

